క్లుప్తంగా

ఎంబీబీఎస్ విద్యార్థినికి సన్మానం

కొల్లాపూర్ రూరల్: మండలంలోని కుడికిల్ల గ్రామానికి చెందిన బచ్చలకూర అరుంధతి ఎంబీబీఎస్‌లో సీటు సాధించడంతో శుక్రవారం కొల్లాపూర్ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు నలుపోతుల నిరంజన్, కల్వకోల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, దండోరా నాయకులు, కుడికిల్ల గ్రామ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువాలతో సత్కరించి సీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విద్యార్థిని తల్లి దండ్రులు, బంధువులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

దాతల చేయూతతో చిన్నారులకు విద్య



మన్ననూర్: స్థానిక అంబేడ్కర్ కాలనీలోని విద్యార్థులకు దాతలు అందిస్తున్న చేయూతతో ఇంటి వద్ద చదువు చెప్పించేందుకు శుక్రవారం ట్యూషన్ లాంఛనంగా ప్రారంభించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యనభ్యసిస్తున్న పేద కుటుంబాల విద్యార్థులకు ఇంటి వద్ద చదువుకునే అవకాశం లేకపోవడంతో విద్యలో కొంత వెనుకబాటుకు గురవుతున్నారు. అదే కాలనీకి చెందిన కొందరు విద్యాదాతలు గమనించారు. కాలనీలోని 1–5 తరగతుల విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా తల్లిదండ్రులు సహకరించి విద్యాపరంగా తమ పిల్లలు ముందుండేందుకు కృషి చేయాలన్నారు. ఈ సందర్భంగా విద్యాదాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు మద్దెల శేఖర్, మంతటి రవి, బుచ్చయ్య, వెంకటేశ్, రఘునాథం, మల్లయ్య పాల్గొన్నారు.

జీపీ కార్మికులకు దుస్తుల పంపిణీ

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో పనిచేస్తున్న 16 మంది పంచాయతీ కార్మికులకు ఎదిరెపల్లి శివకుమార్, కృష్ణవేణి దంపతులు విజయదశమి సందర్భంగా గురువారం నూతన దుస్తులు పంపిణీ చేశారు. దంపతులను కార్మికులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో రాముడు, దీపా, బాలకృష్ణ, జ్యోత్స్న పాల్గొన్నారు.

భారతదేశ సంస్కృతిని కాపాడుకోవాలి

వెల్దండ: భారతదేశ సంస్కృతిని ప్రతి ఒక్కరు కాపాడుకోవాలని, వ్యక్తి నిర్మాణం ద్వారా దేశ నిర్మాణమే ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యమని నాగర్‌కర్నూల్ జిల్లా ప్రచార ప్రముఖ్ గన్నోజు భాస్కరాచారి పేర్కొన్నారు. ఆర్‌ఎస్‌ఎస్ వందేళ్ల ఉత్సవాలను చౌదర్‌పల్లిలో నిర్వహించారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, శోభన్‌బాబు, జగదీష్, మల్లేష్, జంగారెడ్డి, మోహన్, గణేష్, కమలాకర్, రమేష్‌గౌడు, శ్రీను, శేఖర్ ఉన్నారు.

జాతీయ సమావేశంలో శ్రీనివాస్‌రాథోడ్

లింగాల: మండలంలోని దారారం గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్‌రాథోడ్ శుక్రవారం ఢిల్లీలో జరిగిన జాతీయ యువజన కాంగ్రెస్ ఆఫీస్ బేరర్ల సమావేశంలో పాల్గొన్నారు. అంతకు ముందు జాతీయ యూత్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కృష్ణ అల్లవారు, అధ్యక్షుడు ఉదయ్ భాను చిబ్‌ను ఆయన కలిసి సమావేశానికి రావాలని ఆహ్వానం పంపడంపై కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ నిర్మాణానికి రూ.50వేల విరాళం

వెల్దండ: మండలంలోని పోతేపల్లిలో నూతనంగా నిర్మిస్తున్న హన్మాన్ దేవాలయ నిర్మాణానికి గొడేటి లక్ష్మమ్మ, వెంకటయ్య దంపతులు శుక్రవారం రూ.50వేల విరాళం ఉత్సవ కమిటీ సభ్యులకు అందజేశారు. కుమార్తె పావని బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్, శివ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలు పొందినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటమ్మ, శేఖర్, బాలరాజుచారి, వెంకటయ్య, యాదగిరి, శేఖర్, వెంకటయ్య, మల్లేష్, అల్లాజీ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో పలువురికి గాయాలు

మన్ననూర్: అచ్చంపేట–మన్ననూర్ ప్రధాన రహదారి మూల మలుపు సమీపంలో రెండు వాహనాలు ఢీకొని పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీశైలం నుంచి అచ్చంపేట వైపు జడ్చర్లకు వెళ్తున్న కారు, అచ్చంపేట వైపు నుంచి శ్రీశైలానికి వెళ్తున్న క్రూజర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ఇద్దరు చిన్నారులు, ఇద్దరు పురుషులు, మహిళకు తీవ్ర గాయాలు కాగా, క్రూజర్‌లో ఉన్న నలుగురికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని వైద్యం కోసం అచ్చంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



కొల్లాపూర్‌లో దుర్గాదేవి పూజల్లో పాల్గొన్న మంత్రి జూపల్లి కృష్ణారావు



చారకొండ మండలం జూపల్లిలో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న ప్రజలు



నాగర్‌కర్నూల్‌లో రాఘవేంద్రకాలనీలో బొడ్డెమ్మ ఆడుతున్న మహిళలు

ఘనంగా విజయదశమి వేడుకలు



పాలెం వేంకటేశ్వస్వామి ఆలయంలో జమ్మి చెట్టుకు పూజలు చేస్తున్న గ్రామస్తులు

- ఆయుధ పూజ చేసిన కులవృత్తుల వారు
- కనుల పండువగా దుర్గామాత శోభాయాత్ర
- బతుకమ్మ ఆడిపాడిన మహిళలు
- జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు

సాక్షి, నెట్‌వర్క్: జిల్లాలో విజయదశమి, దేవీశరన్నవరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా కొనసాగాయి. గురువారం ఉదయం ఆయా కులవృత్తుల వారు ఆయుధ పూజ, దుకాణాలను, గృహాలను పూలు, తోరణాలతో అలంకరించారు. ఆలయా లు భక్తులతో కిటకిటలాడాయి. సాయంత్రం అ మ్మవారి శోభాయాత్ర కనుల పండువగా నిర్వహించి, నిమజ్జనం చేశారు. జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజ లు చేసి జమ్మిఆకుతో శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

- నాగర్‌కర్నూల్ మండలంలో సాయంత్రం జమ్మిచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లో ప్రజాప్రతినిధులు, రాజకీయ పార్టీల నాయకులు పండగను ఘనంగా చేసుకున్నారు.
- జిల్లా కేంద్రంలో దుర్గామాత శోభాయాత్ర, నిమజ్జనం ఘనంగా నిర్వహించారు. మహిళలు, చిన్నారులు బొడ్డమ్మ ఆడుతూ పురవీధుల్లో ఊరేగింపు చేశారు. నాగనూలు చెరువులో నిమజ్జనం చేశారు.
- అచ్చంపేటలో విజయదశమి రోజు ప్రజలు కొత్త దుస్తులు ధరించి, సాయంత్రం పాలపిట్ట దర్శనం చేసుకున్నారు. ఆయా కులవృత్తుల వారు ఆయుధ పూజ నిర్వహించారు. ఉమామహేశ్వర క్షేత్రం, మద్దిమడుగు ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈవేడుకల్లో అచ్చంపేట ఎమ్మెల్యే దంపతులు డాక్టరు అనురాధ వంశీకృష్ణ, మున్సిపల్ చైర్మన్ గార్లపాటి శ్రీనివాసులు పాల్గొన్నారు.
- తెలకపల్లిలో యువకులు పెద్ద ఎత్తున పాలాలకు వెళ్లి పాలపిట్టను చూశారు. బతుకమ్మలను నిమజ్జనం చేశారు.
- తాడూరు, బిజినేపల్లి మండలాల్లో దుర్గామాత అమ్మవారి చీరలు వేలంపాటలో భక్తులు దక్కించుకున్నారు.
- కొల్లాపూర్‌లో దుర్గాదేవిని, శమీవృక్షాలను రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఎల్లేని సుధాకర్‌రావు దర్శించుకున్నారు. కుడికిల్లలో రాముల వారి విగ్రహాలను ఊరేగించారు. గ్రామాలలో ఆటల పోటీలు నిర్వహించారు.
- కల్వకుర్తి పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి, వేంకటేశ్వరస్వామి, సత్య సాయి మందిరంలో శమీ పూజ నిర్వహించారు. వాసవిమాత భక్తులకు వెండి కలశంలో దర్శనమిచ్చారు.
- పెద్దకొత్తపల్లి, వెల్దండ, ఉప్పునుంతల మండలాల్లో నూతన వస్త్రాలు ధరించి కుటుంబ సమేతంగా జమ్మిచెట్టుకు పూజలు చేశారు. అమ్మవారిని ఊరేగించి అనంతరం నిమజ్జనం చేశారు.
- బల్మూర్, మన్ననూర్, కోడేరు, చారకొండ, పెంట్లవెల్లి మండలాల్లో దసరా వేడుకలు ఘనంగా నిర్వహించారు. మంచాలకట్టలో క్రికెట్, కబడ్డీ పోటీలు నిర్వహించారు.
- లింగాల మండల కేంద్రంలో సాంప్రదాయంగా పటేల్ కుటుంబం, భక్తులు మేరమ్మ ఆలయం నుంచి ఊరేగింపుతో రామాలయం వరకు చేరుకొని శమీ వృక్షానికి పూజలు చేశారు. కులమతాలకతీతంగా పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.
- తిమ్మాజిపేట మండలంలోని తిమ్మాజిపేట, నేరళ్లపల్లి, మారేపల్లి, ఎదిరేపల్లి, గొరిట, చేగుంట, పోతిరెడ్డిపల్లి, గుమ్మకొండ, అప్పాజిపల్లి, బావాజిపల్లి పండుగ సందర్భంగా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.
- నేరళ్లపల్లి శివాంజనేయస్వామి ఆలయంలో అమ్మవారిని ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి దర్శనం చేసుకున్నారు.



కల్వకుర్తిలో వాసవి దేవాలయ ఆవరణలో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న ప్రజలు



కుడికిల్ల రామాలయ ఆవరణలో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న అర్చకులు, ప్రజలు



గౌరారంలో జమ్మిచెట్టుకు పూజలు చేస్తున్న ప్రజలు

గాంధీజీ ఆశయ సాధనకు కృషి



గాంధీజీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

సాక్షి, నెట్‌వర్క్: సత్యం, అహింస మానవతా విలువలకు మూలాధారమని, ఈ సిద్ధాంతాలను పాటిస్తే సమాజంలో మార్పు తప్పక సాధ్యమవుతుందని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. మహాత్మా గాంధీ 156వ జయంతిని పురస్కరించుకొని జిల్లా కేంద్రంలోని మున్సిపల్ పార్క్‌లో గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గాంధీజీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం, సమానతా సమాజం కోసం ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. యువత గాంధీజీ చూపిన సత్యం, అహింస మార్గాలను ఆదర్శంగా తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

అహింసా మార్గాన్ని పాటించాలి

గాంధీజీ సిద్ధాంతాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ అహింసా మార్గాన్ని అనుసరించాలని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేశ్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలో గాంధీపార్క్ వద్ద గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాంధీజీ సత్యం, అహింస, సమానత్వం కోసం చేసిన పోరాటాన్ని స్మరించుకుంటూ ప్రజలు ఆయన ఆలోచనలు, సిద్ధాంతాలను జీవితంలో ఆచరించాలని పిలుపునిచ్చారు.

- అచ్చంపేట పాతబజార్‌లోని గాంధీ విగ్రహానికి ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ, వివిధ పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. పట్టణంలో గాంధీ కాంస్య విగ్రహం ఏర్పాటుకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. మున్సిపల్ కార్మికులకు పారిశుద్ధ్య పరికరాలను అందజేశారు.
- కొల్లాపూర్‌లో గాంధీ విగ్రహానికి సీపీఐ, టీపీసీసీ నాయకులు గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పెన్నులు, నోట్‌పుస్తకాలు, వృద్ధులకు పండ్లు, బ్రెడ్లు అందజేశారు.
- పెంట్లవెల్లిలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- కల్వకుర్తి పట్టణంలో ఆర్టీసీ బస్టాండ్, గాంధీనగర్, వాసవి క్లబ్ బిల్డింగ్, బొక్కలకుంట రోడ్డులోని గాంధీ విగ్రహాలకు ఆర్యవైశ్య మహాసభ, వాసవి క్లబ్, లయన్స్ క్లబ్, ఆవోపా ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- వెల్దండ మండలంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- ఉప్పునుంతల ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల వద్ద జాతిపిత చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేశారు.
- కోడేరు మండల కేంద్రంతో కొండ్రావుపల్లి, రాజాపూర్ గ్రామాల్లో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- తిమ్మాజిపేటలో కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకులు గాంధీ విగ్రహానికి, మారేపల్లిలో గాంధీ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు.
- దోమలపెంటలో మహాత్మాగాంధీ జయంతి పురస్కరించుకుని ఈగలపెంటలోని భూగర్భ కేంద్రం సిఈ పరిపాలన కార్యాలయంలో గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.



అచ్చంపేటలో పారిశుద్ధ్య కార్మికులకు పరికరాలను అందిస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ



పెంట్లవెల్లిలో గాంధీ విగ్రహం వద్ద నివాళులు



ఉప్పునుంతలలో..



ఈగల పెంటలో..



కొండ్రావుపల్లిలో..

సామూహిక వివాహాల కోసం సీఎంకు ఆహ్వానం



సీఎం రేవంత్‌రెడ్డికి ఆహ్వాన పత్రికను అందిస్తున్న కౌన్సిలర్ అప్ప శివ

అచ్చంపేట రూరల్: సామూహిక వివాహాలు పేదలకు వరం లాంటివని సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ చిక్కుడు వంశీకృష్ణ అన్నారు. గురువారం వంగూరు మండలం కొండారెడ్డిపల్లికి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డిని సామూహిక వివాహాల నిర్వాహకుడు అచ్చంపేట మున్సిపల్ కౌన్సిలర్ అప్ప శివ కలిశారు. కౌన్సిలర్ శివ ఆధ్వర్యంలో నవంబర్ 16న అచ్చంపేటలో నిర్వహించబోయే ఉచిత సామూహిక వివాహాల ఆహ్వాన పత్రికను సీఎంకు అందజేశారు. పేద ప్రజలు సామూహిక వివాహాలను సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు. కుల మతాలకతీతంగా అచ్చంపేట ప్రాంతంలో ఎన్నడూ కనివిని ఎరగని రీతిలో సామూహిక వివాహాలు చేయనున్నారన్నారు. అచ్చంపేట నియోజకవర్గంతో పాటు దేవరకొండ, నాగర్‌కర్నూల్ ప్రాంత ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలన్నారు. అప్పశివను సీఎం, ఎమ్మెల్యే అభినందించారు. సామూహిక వివాహాలు చేసుకునే వారు పట్టణంలోని లింగాల రోడ్డులో ఉన్న అప్పశివ జ్యువెల్లర్స్‌లో పేర్లను నమోదు చేసుకోవాలని కౌన్సిలర్ అప్ప శివ కోరారు. బంగారు పుస్తె, వెండి మెట్టెలతో పాటు వధూవరులకు దుస్తులు, బీరువా, ఇతర గృహోపకర వస్తువులు ఇస్తామని ఆయన తెలిపారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ 7661008966ను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి

నాగర్‌కర్నూల్: మున్సిపాలిటీని పరిశుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి అన్నారు. మున్సిపాలిటీకి రూ.55 లక్షలతో మంజూరు చేయించిన రెండు చెత్త సేకరణ ట్రాక్టర్లు, డ్రెయిన్ సేవరేజ్ మిషన్లకు గురువారం ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి పూజలు నిర్వహించి మున్సిపాలిటీకి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల సౌకర్యమే తమ లక్ష్యమని, నాగర్ కర్నూల్ పట్టణాన్ని క్లీన్ అండ్ గ్రీన్ గా ఉంచడానికి ఎప్పుడూ కట్టుబడి ఉంటామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ రమణారావు, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, పట్టణ మాజీ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

ఎండిన చెట్లతో పొంచి ఉన్న ప్రమాదం



మైలారం స్టేజీ వద్ద రోడ్డుపై ప్రమాదకరంగా ఉన్న ఎండిన చెట్లు

- పట్టించుకోని ఆర్‌అండ్‌బీ అధికారులు
- భయాందోళనలో వాహనదారులు

బల్మూర్: ఆర్‌అండ్‌బీ రోడ్లకు ఇరువైపుల ఎండిపోయిన భారీ వృక్షాలు ఏ క్షణమైన వాహనదారుల నెత్తిన పడే ప్రమాదం ఉండగా, అధికారులు వాటిని తొలగించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని బల్మూర్–అచ్చంపేట ప్రధాన రహదారిలోని మైలారం స్టేజీ, దొంతికుంట వద్ద ఇరువైపుల ఎన్నోఏళ్ల నాటి చిమ తంగెడి భారీ వృక్షాలు ఎండిపోయి కొమ్మలు తరచు రోడ్డుపై పడుతున్నాయి. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు తడిసిన ఈ చెట్ల కొమ్మలు నిత్యం కిందపడుతుండటంతో ఆ దారిలో వచ్చే వరకు ఎక్కడ నెత్తిన పడతాయేననే భయంతో ద్విచక్రవాహనదారులు భయాందోళన చెందుతున్నారు. పది రోజుల క్రితం ఎండిన కొమ్మలు నాలుగు చక్రాల వాహనంపై పడటంతో వాహనం స్వల్పంగా దెబ్బతిన్నది. అందులో ప్రమాణిస్తున్న వారు సురక్షితంగా బయట పడ్డారు. ఈ రహదారిపై ఐదు వరకు భారీ వృక్షాలు ఏడాది క్రితం నుంచి ఎండిపోయి కొమ్మలు విరిగి పడుతున్నా, ఆర్‌అండ్‌బీ అధికారులు వాటిని తొలగించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారు. వాటిని తొలగించ కుంటే ఏ క్షణంలోనైనా కొమ్మలు విరిగి వాహనదారులపై పడి ప్రాణనష్టం జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి వాటిని తొలగించాలని వారు కోరుతున్నారు.

విజేతలకు బహుమతులు అందజేసిన ఎమ్మెల్యే

తిమ్మాజిపేట: మండలంలోని గొరిటలో గొరిట ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలలో విజేతలకు ఎమ్మెల్యే డాక్టర్ రాజేశ్‌రెడ్డి బహుమతులు అందజేశారు. పండుగ సందర్భంగా రెండు రోజులు దివంగత అలివేలమ్మ, బాల్‌రెడ్డి జ్ఞాపకార్థం వారి కుమారులు గొరిట ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు నిర్వహించారు. ప్రథమ బహుమతి రూ.10వేలు, ద్వితీయ బహుమతి రూ.5వేలు ఎమ్మెల్యే అందజేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు అచ్యుతారెడ్డి, శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

విజేతలకు బహుమతుల ప్రదానం

వెల్దండ: మండలంలోని కుప్పగండ్లలో ప్రీమియర్ లీగ్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ విజేతలకు శుక్రవారం బహుమతులు అందజేశారు. మొదటి విజేతగా ఈగల్స్ టీమ్, రెండో విజేతగా భగత్‌సింగ్ ఫైటర్స్ నిలిచారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శారదమ్మ, సింగల్‌విండో డైరెక్టర్ శేఖర్, నాయకులు వెంకట్‌రెడ్డి, రమేష్, సురేష్‌రెడ్డి, రమేష్, నాగరాజుగౌడు, దశరథం ఉన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



లింగాల: మండలంలోని అప్పాయపల్లికి చెందిన సింధును కాన్పు కోసం నాగర్‌కర్నూల్ ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గం మధ్యలోనే ఆడ శిశువుకు జన్మనిచ్చింది. ఈ సంఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఆమెను ముందుగా కాన్పు కోసం మండల కేంద్రంలోని సీహెచ్‌సీకి కుటుంబ స భ్యులు తీసుకెళ్లారు. అక్కడ కాన్పు కావడం కష్టమని వైద్య సిబ్బంది తెలపడంతో 108లో ఏరియా ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో పురిటి నొప్పులు వచ్చాయి. దీంతో అంబులెన్స్‌లో 108 సి బ్బంది కాన్పు చేశారు. అంబులెన్సు సిబ్బంది ఈ ఎంటీ శివశంకర్, పైలెట్ కిషోర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ఏజెన్సీలో గిరిజనేతరులకు రిజర్వేషన్లు ఆపాలి

కొల్లాపూర్ రూరల్: ఏజెన్సీలో ఉన్న గిరిజనేతరులకు రిజర్వేషన్లు ఆపాలని తెలంగాణ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని ముక్కిడిగుండంలో గిరిజన సంఘం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐదో షెడ్యూల్ భూ భాగంలో ఉన్న ఏజెన్సీ ప్రాంతలో వార్డు మెంబర్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, ఎంపీపీ స్థానాలలో గిరిజనేతరులకు అవకాశం ఇవ్వకూడదన్నారు.

అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు



పెద్దకొత్తపల్లిలో బతుకమ్మలను పరిశీలిస్తున్న నాయకులు

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో గురువారం రాత్రి బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. 130 మంది మహిళలు బతుకమ్మను తయారు చేయగా మొదటి బహుమతి 3 గ్రాముల బంగారం, రెండో బహుమతి 2 గ్రాముల బంగారం, మూడో బహుమతి 1 గ్రాము బంగారం మార్కెట్ కమిటీ చైర్మన్ దండు నర్సింహ, మాజీ సర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి అందజేశారు. బతుకమ్మలను తయారు చేసిన ప్రతి బృందానికి అర తులం వెండిని బహుమతులుగా అందజేశారు.

బతుకమ్మ సంబరాలు

కొల్లాపూర్ రూరల్: మండలంలోని సింగోటంలో బీజేపీ ఆధ్వర్యంలో బీజేపీ జిల్లా నాయకులు సాయికృష్ణగౌడ్ సమక్షంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. మహిళలందరికి బహుమతులు ప్రదానం చేశారు. మొదటి బహుమతి రూ.5వేలు, రెండో బహుమతి రూ.4వేలు, మూడో బహుమతి రూ.3వేలు, నాల్గవ బహుమతి రూ.2వేలు, ఐదో బహుమతి రూ.1వెయ్యి అందజేశారు. కార్యక్రమంలో ప్రజలు, మహిళలు పాల్గొన్నారు.



బహుమతులు ప్రదానం చేస్తున్న సాయికృష్ణగౌడ్

రోడ్డుపై గుంతలు పూడ్చిన క్రీడాకారులు

తెలకపల్లి: మండల కేంద్రంలో జయశంకర్ చౌరస్తాలో బీటీ రోడ్డుపై ఏర్పడిన గుంత వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కల్వకుర్తి–నాగర్‌కర్నూల్–అచ్చంపేట ప్రధాన చౌరస్తాలో బీటీ రోడ్డు ధ్వంసం కావడంతో పలువురు ప్రమాదానికి గురయ్యారు. గుంత మరింత విస్తరించి భయాందోళనకు గురి చేస్తోంది. తెలకపల్లికి చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారులు సొంత డబ్బులతో గుంతలు పూడ్చి మరమ్మతు చేసి ప్రయాణికులకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చేశారు. గుంతలు పూడ్చడంలో క్రీడాస్ఫూర్తిని చాటి ప్రజా సేవ చేయడంతో పలువురు హర్షం వ్యక్తం చేశారు. గుంతలు పూడ్చిన వారిలో రాజా మహేందర్‌రెడ్డి, సాయిబాబు, గాజుల ఆనంద్ పాల్గొన్నారు.



జయశంకర్ చౌరస్తాలో గుంతలు పూడ్చుస్తున్న క్రీడాకారులు

ఐక్యతతో సమస్యలు పరిష్కరించుకోవాలి



లింగాల: సమిష్టిగా ఉంటూ సమస్యలు పరిష్కరించుకోవాలని ఎరుకల సంఘం నాయకులు తీర్మానించారు. శుక్రవారం మండల కేంద్రంలోని రామాలయం ఆవరణలో ఎరుకల కులస్తుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వైశమ్యాలను వీడి సమష్టిగా హక్కుల కోసం పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నా రు. మండల కేంద్రంలో కులదైవం ఏకలవ్వ కాంస్య విగ్రహం ఏర్పాటుకు భాగస్వాములై ప్రతి ఎరుకల కులస్తుడు సహకరించాలని తీర్మానించారు. ఈ సందర్భంగా ఎరుకల సంఘం మండల అధ్యక్షుడిగా మల్లె పరమేశ్వరును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మోహన్‌బాబు, శ్రీనివాసులు, శేఖర్, కుల పెద్దలు పాల్గొన్నారు.